సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ¦ 27 ¦ మే ¦ 2024



అరసవల్లిలో వైశాఖి సందడి

ఆదిత్యుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఒక్కరోజులోనే రూ.13.75 లక్షల ఆదాయం లభించింది.

- 8లో



కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

కౌంటింగ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్ కొనసాగుతోంది. గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

- 8లో

కథా నిలయంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: కథా నిలయంలో కారామాస్టారు సేకరించిన పుస్తకాలలో రెండు కాపీలు ఉన్న వాటిని సాహిత్యాభిమానులకు ఉచితంగా పంపిణీ చేస్తామని కథానిలయం ట్రస్టు ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4 నుంచి 9 వరకు కథా నిలయం మేడపైన ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల సమయంలో వీటిని అందిస్తామన్నారు. స్థలాభావం సమస్యతో పాటు తూకానికి అమ్మలేక వీటిని ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ముంచుకొచ్చిన ఉప్పుటేరు



డొంకూరు, బూర్జపాడు పంట పొలాల్లోకి చేరిన ఉప్పునీరు

ఇచ్ఛాపురం రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో డొంకూరు మత్స్యకార తీర ప్రాంతంలో సముద్రం అధిక పోటుకు గురైంది. దీంతో స్థానిక పంట పొలాలు ఉప్పుటేరు నీటితో నిండిపోయాయి. ఆదివారం ఉదయం ఉవ్వెత్తున లేచిన కెరటాలతో డొంకూరు, బూర్జపాడు పంట పొలాల్లో నీరు చేరింది. ఖరీఫ్ పంటకు సిద్ధమవుతున్న సమయంలో పొలాల్లోకి ఉప్పు నీరు చేరడం పట్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నేడు ఉద్యోగ విజయోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య చెప్పారు. కళాశాలలో ఆదివారం ఆయన మాట్లాడుతూ క్యాంపస్ డ్రైవ్‌ల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి సన్మానిస్తామని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ డిప్లమో పూర్తిచేసిన విద్యార్థులు రిలీవ్ అయ్యే నాటికి శతశాతం ప్లేస్‌మెంట్‌లు సాధించటం లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యలో మార్పులు, ఇంటర్న్‌షిప్ అమలు, ప్రయోగ విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు.


సజావుగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు



హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు కేంద్రాల్లో 1228 మందికిగాను 1212 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్టులో 320 మందికి 319 మంది, రెండో షిఫ్టులో 320 మందికి 318 మంది, చిలకపాలెం శివానీ కాలేజీలో మొదటి షిఫ్టులో 154 మందికి 150 మంది, రెండో షిఫ్టులో 154 మందికి 149 మంది, ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొద టి షిఫ్టులో 140 మందికి 138 మంది, రెండో షిఫ్టులో 140 మందికి 138 మంది హాజరయ్యారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు సిద్ధం చేసిన సహాయ కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్–2024 కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడే ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. జిల్లాలో 10871 మంది పాలిసెట్ రాయగా 9596 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 780, ఐదు ప్రైవేట్ కళాశాల్లో 1811 సీట్లు కలిపి మొత్తం 2591 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జూన్ రెండు వరకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించవచ్చు. ర్యాంకు బట్టి ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. మొదటి రోజు సోమవారం 1 నుంచి 12000 మధ్య ర్యాంకు సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ జూన్ 3 వరకు కొనసాగుతుంది. ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 5న ఆప్షన్ల మార్పుకు అవకాశం కల్పించారు. జూన్ 7న సీట్ల ఎలాట్‌మెంట్ ప్రకటించనున్నారు. విద్యార్థులు షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ జి.దామోదర్‌రావు తెలిపారు.

నాగావళికి స్వచ్ఛ అందం

- నది శుభ్రతకు ముందుకొచ్చిన 250 మంది యువత
- సహాయమందించిన శ్రీకాకుళం మున్సిపల్ యంత్రాంగం
- ఇకపై ప్రతి ఆదివారం 'క్లీన్ శ్రీకాకుళం'



చెత్తను సేకరిస్తూ..

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని నాగావళి నదిని శుభ్రం చేయాలనే ఒక యువకుడి ఆలోచనకు వందలాది మంది తోడయ్యారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశుభ్రతా సేవలో భాగస్వాములయ్యారు. వీరి ఆలోచనకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సైతం మద్దతుగా నిలిచి తమవంతు సాయం అందించింది. ఫలితంగా ఆదివారం ఉదయం నిర్వహించిన 'క్లీన్ శ్రీకాకుళం' కార్యక్రమం విజయవంతమైంది. శ్రీకాకుళం నగరానికి చెందిన కె.జీవన్ తన ఇన్‌స్టాగామ్ ద్వారా ఇచ్చిన పిలుపు మేరకు సిద్ధార్థరాజ్, ప్రమోద్ నాయుడు, యోగేష్‌నాయుడు ముందుకు రాగా.. వారితో యశ్వంత్, ప్రశాంత్, మధు, హరిష్, ప్రణీత్, భరత్, హర్ష, లక్కీ, స్వరూప్ దుష్యంత్‌లు తోడువచ్చారు. వీరి స్ఫూర్తిగా మరికొంత మందితో నది వద్దకు చేరుకోవడంతో ఆదివారం జరిగిన క్లీన్ శ్రీకాకుళం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. వీరి కృషిని మెచ్చి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు కూడా స్పందించి సిబ్బందిని పంపించారు.





నాగావళి నదీ తీరాన్ని శుభ్రపరుస్తున్న యువత, మున్సిపల్ సిబ్బంది



మాలక్ష్యం : క్లీన్ శ్రీకాకుళం- స్వచ్ఛ నాగవళి

సామాజిక మాధ్యమాల్లో..

నాగావళిని పరిశుభ్రం చేయాలనే ఆలోచనను ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేయగా మంచి స్పందన వచ్చింది. తరువాత ట్విటర్‌లో కూడా పోస్టు చేయడంతో సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వీరికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాస్కులు, గ్లౌజులు, డస్ట్‌బిన్ బ్యాగులు సరఫరా చేశాయి.

అందరి బాధ్యత..

శ్రీకాకుళం నగర ప్రజలకు జీవనాధారమైన నాగావళి నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని క్లీన్ శ్రీకాకుళం సభ్యులు పేర్కొన్నారు. నదిలో పేరుకుపోతున్న చెత్తను తొలగించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ ఆలోచనను కొనసాగిస్తూ 'క్లీన్ శ్రీకాకుళం' పేరుతో ఎక్కడైనా ఇటువంటి సేవా కార్యక్రమం నిర్వహిస్తే తాము ముందుంటామని తెలిపారు. ఇకపై ప్రతి ఆదివారం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమం నిర్వహణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రతిఒక్కరికీ, ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు, సిబ్బంది, ఇన్‌స్టాగామ్ ఇన్‌ఫ్లూయర్స్ హెల్లో చిక్కోలు, క్లీన్ శ్రీకాకుళం, మనీ హంట్ శ్రీకాకుళం, శ్రీకాకుళం వెదర్‌మ్యాన్, శ్రీకాకుళం హవా, ఎక్స్‌ప్లోర్ శ్రీకాకుళం, హెలో శ్రీకాకుళం, మైశ్రీకాకుళం, మా శ్రీకాకుళం, శ్రీకాకుళం అఫీషియల్స్, శ్రీకాకుళం అబ్బాయి, లవ్ శ్రీకాకుళం ఫరెవర్, ప్రశాంత్ వ్లోగ్స్ తదితరులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన సామగ్రిని దాతలు అందించవచ్చని, వివరాలకు 79811 07423, 99632 95929 నంబర్లను సంప్రదించాలని కోరారు.



చేయి..చేయి. కలుపుతూ.. పరిశుభ్రం చేస్తూ..

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ కొలువు

- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సాకారం
- ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- శ్రీకాకుళంలో ఈ నెల 31న జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కొలువు సాధించే మహత్తర అవకాశం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదువుకునేలా రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ కంపెనీ సంయుక్తంగా ఈ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇంటర్మీడియెట్‌లో 750, ఆపై మార్కులతో ఉత్తీర్ణులైన అన్ని గ్రూపుల (మ్యాథ్స్ అభ్యర్థులు అనర్హులు) విద్యార్థులకూ ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన(ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాసైన వారు కూడా) ఈ ఉద్యోగాలకు అర్హులు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన 400 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. వీరికి ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తారు.



ఇంటర్మీడియెట్ విద్యార్థులు



ఈ మూడు కేటగిరీలే కీలకం..

ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ఇంగ్లీషు భాష ప్రావీణ్యం పరీక్షిస్తారు. మూడింటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. ఈ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణ అనంతరం ఏడాదికి 1.70 లక్షల ప్రారంభ వార్షిక వేతనం పొందవచ్చు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఇతర ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీఓ విభాగంలో కూడా ఉద్యోగాలు పొందవచ్చు.



హెచ్‌సీఎల్ టెక్ బ్రోచర్

ఉద్యోగం చేస్తూ ఉన్నత విద్యాభ్యాసం..

ఇంటర్‌తో కొలువులో చేరిన విద్యార్థుల చదువు అక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా వినూత్నంగా ప్రణాళికను రూపొందించింది. ఇందుకు అనేక యూనివర్సిటీలతో హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు కింద విద్యార్థులకు చెల్లించే జీతంలో హెచ్‌సీఎల్ కంపెనీ ఏటా రూ.15 వేలు ఇవ్వనుంది. విద్యార్థులు రిజిస్ట్రేషన్, సందేహాల నివృత్తి కోసం హెచ్‌టీటీపీఎస్://బిఐటి.ఎల్‌వై/టెక్‌బిఈఈజీవోఏపీ వెబ్‌పోర్టల్‌ను చూడవచ్చు. పూర్తి వివరాలకు సంస్థ ప్రతినిధి సెల్ 6300878377(యోగేష్)ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్‌ఐవో పి.దుర్గారావు సూచించారు.

గొప్ప అవకాశం..



జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నాం. శ్రీకాకుళంలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. ఇంటర్ 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఉమ్మడిశెట్టి అనిల్, హెచ్‌సీఎల్ టెక్‌బీ స్టేట్ మేనేజర్

ప్రభుత్వ చొరవతో



విద్యార్థులు ఇంటర్ విద్యతోనే ఉద్యోగం సంపాదించుకునేలా ప్రభుత్వం మంచి ప్రణాళిక రూపొందించింది. కమిషనర్, ఆర్జేడీ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు విషయం తెలియజేశాం. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చు.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓ

ఘనంగా గజవాహన సేవ



నరసన్నపేటలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గజవాహనసేవ వైభవంగా నిర్వహించారు. పెద్దపేట మీదుగా మెయిన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్ కూడలి వరకూ గజవాహనంపై స్వామివారిని ఊరేగించారు. వందలాది మంది భక్తులు వెంట నడవగా.. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– నరసన్నపేట

ఏడేళ్ల బుడతడు.. గణితంలో ఘనుడు



- మూడో తరగతిలోనే టెన్త్ స్థాయి లెక్కల్లో ప్రావీణ్యం
- రెండు నిమిషాల్లో 197 జాతీయ జెండాల గుర్తింపు
- రెండుసార్లు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం

టాలెంట్

ఇచ్ఛాపురం రూరల్: కొంతమంది విద్యార్థులు లెక్కలంటే హడలిపోతారు. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తున్నా గణితానికి వచ్చేసరికి వెనకంజలో నిలిచిపోతారు. అయితే ఇచ్ఛాపురానికి చెందిన పడాల పార్థివ్ శ్రీవత్సల్ 'లెక్క' వేరు. ఏడేళ్ల వయసులోనే తన గణిత ప్రావీణ్యతతో పెద్దల్ని సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. అరుదైన రికార్డులను సాధించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించాడు.

లెక్కలపై మక్కువ..

పడాల పార్థివ్ శ్రీవత్సల్ తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. తండ్రి పడాల అప్పలనాయుడు లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి లక్ష్మీ.. అమీన్ సాహెబ్ పేట ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. వీరి స్వగ్రామం హిరమండలంలోని భగీరథపురం. నాలుగేళ్ల కిందట ఇచ్ఛాపురం మండలానికి బదిలీపై వచ్చారు. పార్థివ్ చిరుప్రాయం నుంచే గణితంపై మక్కువ పెంచుకున్నాడు. గత ఏడాది ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధులు నిర్వహించిన పోటీల్లో గణితంలో 1 నుంచి 50 వరకు గణాలు (క్యూబ్‌లు) 1 నిమిషం 36 సెంకడ్లలో రాసి మొదటిసారి వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది జనవరి 26న మరోమారు గణితంలో 1 నుంచి 100 వరకు గణాలు (క్యూబ్‌లు) కేవలం 4 నిమిషాల 24 సెంకడ్లలో రాసి మరోమారు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు.



రెండు నిమిషాల్లో వివిధ దేశాల జెండాలను గుర్తిస్తున్న పార్థివ్ శ్రీవత్సల్

అవలీలగా పది లెక్కలు..

ఈ బుడతడు మూడవ తరగతిలోనే తొమ్మిది, పదో తరగతి గణిత శాస్త్రంలో ఉండే త్రికోణమితి, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలు, సాంఖ్యక శాస్త్రం వంటి లెక్కల్ని సునాయాసంగా చేస్తున్నాడు. కేవలం రెండు నిమిషాల్లో 195 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను అవలీగా గుర్తిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.



తల్లి దండ్రులతో చిన్నారి పార్థివ్ శ్రీవత్సల్

మరిడమ్మ సేవలో ఎస్పీ



ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం సమీపంలో ఉన్న మరిడమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ జీఆర్ రాధిక అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ గణపతి



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్ట హర చతుర్థి పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. షిరిడీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు గణపతి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాట్యకారులకు అవార్డులు



ఎంపికైన వారితో చిన్నా గురుస్వామి

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన ఆరుగురు నాట్యకారులు స్వర్ణనంది అవార్డులకు ఎంపికైనట్లు అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి ఆదివారం తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో జరగనున్న నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో ఎన్టీఆర్ స్మారక స్వర్ణనంది అవార్డులను అందజేయనున్నట్లు శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణమూర్తి తెలియజేసినట్లు పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన నాట్యగురువు శృతిపట్నాయక్, డి.కావ్య, ఎన్.శైలు, ఎస్.పూజ, సీహెచ్ జయలక్ష్మి, శ్వేతా రాణిలను పలువురు అభినందించారు.

శ్రీముఖలింగంలో భక్తజన సందోహం



ఆలయం వద్ద భక్తుల పూజలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఆదివారం భక్తజన సందోహం నెలకొంది. వైశాఖ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానికులతో పాటు విజయనగరం, విశాఖ, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. హిరమండలంలోని అంబావల్లి గ్రామంలో వెలిసిన త్రినాథస్వామి ఆలయం వద్ద కూడా భక్తుల రద్దీ కనిపించింది.

ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కుమార్‌నాయక్



పలాస : ఫిలిం చాంబర్స్ ఆఫ్ కామర్స్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా పలాసకు చెందిన డాక్టర్ కుమార్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎ.పి.రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎస్.రాజేంద్ర, కార్యదర్శి వి.వాసవి నుంచి నియామక పత్రాన్ని ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఉత్తరాంధ్రలో సినీ హబ్ నిర్మాణానికి చాంబర్ కృషి చేస్తుందన్నారు. ఉద్దానం ప్రాంతంలో సినిమా షూటింగ్‌లు విరివిగా చేపడతామని చెప్పారు. విస్తారమైన లోకేషన్లు పలాస ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. కుమార్‌నాయక్ నియామకంపై ఖిలాయివాణి ద్విభాషా పత్రిక సంపాదకుడు, సినీ నటుడు లండ రుద్రమూర్తి, జనజాగృతి అధ్యక్షుడు నటుడు తెప్పల కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రోణంకి హేమాచలం, తమ్మినాన మాధవరావు, లలిత కళారంజలి అధ్యక్షుడు చిన్నాచారి, కళాకారుడు రాపాక ధనరాజు తదితరులు అభినందించారు.



ఆలయం ముందు భాగంలో భక్తుల రద్దీ



భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



బారులు తీరిన భక్తులు

అరసవల్లిలో వైశాఖ సందడి



పుష్కరిణి వద్ద సూర్యునికి దీప హారతినిస్తున్న మహిళలు

- ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజు ఆదాయం రూ.13.75 లక్షలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి ఆదిత్యాలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు సూర్యనారాయణ స్వామి దర్శనానికి బారులు తీరారు. వైశాఖమాసం మూడో ఆదివారం సందర్భంగా సంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పవిత్ర ఇంద్రపుష్కరిణి వద్ద ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఈవో ఎస్.చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి వైశాఖమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు వివిధ రకాల ఫలాలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ పరిసరాల్లోఅవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వన్ టౌన్ సీఐ మధుసూదనరావు, ఎస్సై బలివాడ గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గంటల కొద్దీ క్యూలో..

వైశాఖ ఆదివారం కావడంతో అరసవల్లిలో ఎక్కడ చూసినా జనంతోనే పరిసరాలన్నీ నిండిపోయాయి. భక్తులకు ముందస్తుగానే దర్శనాలకు ఏర్పాట్లు చేసినప్పటికీ..ఉచిత దర్శనాల నుంచి వచ్చిన భక్తుల విషయంలో ఆలయ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఎనిమిది మంది భక్తులు ఉపవాసాలతో దర్శనాలకు వచ్చి గంటల కొద్దీ దర్శనాల క్యూలైన్లో ఉండలేకఅక్కడే కుప్పకూలిపోయారు. మరికొందరు నీరసంతో కళ్లు తిరిగి పడిపోయారు. వెంటనే ప్రభుత్వ వైద్యుల, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు స్పందించి ప్రథమ చికిత్స అందజేశారు.ఈసారి ఉచిత దర్శనాల కోసం పుష్కరిణి గట్టు మీద వరకు భక్తులు బారులు తీరడం విశేషం. విశిష్ట దర్శనాల క్యూలైన్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణ దర్శనానికి సుమారు మూడు గంటల పాటు సమయం పడితే, ప్రత్యేక దర్శనానికి సుమారు 45 నిమిషాల సమయం పట్టింది.

ఆదాయానికి గండి..

గత ఆదివారం ఏకంగా రూ.19 లక్షలకు మించిన ఆదాయం వస్తే ..ఈ సారి భక్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ రూ.13,75,223 ఆదాయమే లభించింది. ఇందుకు ప్రధాన కారణం పోలీసుల చర్యలే అని ఆలయ అధికార వర్గాలు భావిస్తున్నారు. ఉదయం 10 గంటల తర్వాత భారీగా భక్తులు తరలిరావడంతో విశిష్ట దర్శనంతో పాటు (రూ.500), ప్రత్యేక దర్శనాల టికెట్లు (రూ.100) విక్రయాలను పోలీసులు అర్ధాంతరంగా నిలిపివేయించారు. సుమారు రెండు గంటల వరకు ఎలాంటి టికెట్లు అమ్మకుండా జనమంతా ఫ్రీ దర్శనాలను చేసుకున్నారు. దీనిపై ఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు కలిసి పోలీసు అధికారులకు చెప్పినా టిక్కెట్ల విక్రయాలు జరగలేదు. తర్వాత కొంత సమయం తర్వాత మళ్లీ యథావిధిగా టిక్కెట్లను విక్రయించారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.9,06,700, పలు రకాల విరాళాల ద్వారా రూ.83,523, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.3.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

భక్తురాలి బంగారు గొలుసు మాయం

శ్రీకాకుళం క్రైమ్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పుష్కరిణి వద్ద ఓ భక్తురాలు బంగారు గొలుసు పోగొట్టుకుంది. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చెందిన పి.రాములమ్మ అరసవల్లి ఆదిత్యుని దర్శనానికి వచ్చారు. పుష్కరిణిలో స్నానానికి దిగేటప్పుడు రెండు తులాల బంగారు గొలుసు పడిపోయింది. ఎంత వెతికినా కనిపించలేదు. ఆ సమయంలో పక్కనే కొందరు వ్యక్తులు ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించింది. విచారణ చేస్తున్నామని ఎస్ఐ గణేష్ తెలిపారు.



పుష్కరిణితో పాటు గట్టుపై బారులు తీరిన ఉచిత దర్శన భక్తులు

● చెట్టంత పుట్ట

మందస మండలం రామరాయి గ్రామ సమీపంలో జీడితోటల్లో నిలువెత్తు పుట్టలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. భైరి నాగులు అధికంగా తరిగే ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయ పనులలో భాగంగా ఎప్పటికప్పుడు పుట్టలను తొలగిస్తున్నా కొద్ది రోజుల్లోనే మళ్లీ పుట్టుకు వస్తున్నాయి. సుమారు ఎనిమిది నుంచి పదహారు అడుగుల ఎత్తు వరకు ఈ పుట్టలు పెరుగుతున్నాయి.

\- కాశీబుగ్గ



బోరుభద్ర విద్యార్థుల ప్రతిభ



కొన్ని విజేంద్ర

సంతబొమ్మాళి: సైన్స్ ఒలింపియాడ్ జాతీయ స్థాయి ప్రతిభా పరీక్షలో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. కొన్ని విజేంద్ర జాతీయ స్థాయిలో 50వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించాడని, జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన ఏకైక జిల్లా పరిషత్ పాఠశాలగా బోరుభద్ర నిలవడం గర్వకారణంగా ఉందని చెప్పారు. అదే విధంగా పాఠశాలకు చెందిన భైరి మనీష్ కుమార్ రాష్ట్ర స్థాయి 24వ ర్యాంకు, గన్నవరపు సూర్య రాష్ట్రస్థాయి 34వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. వీరిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎం.వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, బాడాన రాజు, డి.రజిని, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, ఎం.శంకర్‌రావు, బి.కమలకుమారి, గోపాలరెడ్డి, సుశీలదేవి, కృష్ణ, సాయి శివాని, త్రివేణి అభినందించారు.

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ఇచ్ఛాపురం: కౌంటింగ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్ కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అమీన్‌సాహెబ్‌పేట (ఏఎస్‌పేట)లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీశారు. ట్రాన్స్‌పోర్టు, ఇతర గోదాములను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● అ'పూర్వ' సమ్మేళనం



ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా జరిగింది. ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆనాటి ముచ్చట్లు పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఐ.రామకృష్ణ, జి.శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

\- శ్రీకాకుళం కల్చరల్

● పచ్చని స్వాగతం



పలాస మండలం మాకన్నపల్లి గ్రామం వెళ్లే దారి పచ్చదనంతో కనువిందు చేస్తోంది. ఎండలు మండుతున్న తరుణంలో ఇరువైపులా ఉన్న చెట్లు నీడనిస్తూ ఆహ్లాదం కలిగిస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి మాకన్నపల్లి వరకు పచ్చని స్వాగతం పలుకుతున్నాయి.

\-కాశీబుగ్గ

ఏజెంట్ల ఎంపికలో బిజీబిజీ

- కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామకానికి ప్రధాన పార్టీల కసరత్తు
- నేరచరిత్ర లేనివారికి మాత్రమే ఎన్నికల సంఘం అనుమతి
- ఆ మేరకు వివరాలు కోరుతూ అభ్యర్థులకు అధికారుల ఆదేశం

హిరమండలం: ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలేందుకు వారం రోజులే మిగిలింది. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు రోజు చేయాల్సిన కార్యక్రమాలపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టిసారించాయి. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకునేందుకు కసరత్తు చేపట్టాయి. ఎప్పటికప్పుడు కౌంటింగ్ సరళిని గమనించేందుకు ముఖ్యనాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నాయి.

బూత్‌స్థాయి నేతలే కీలకం..

ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని ప్రధాన పార్టీల నాయకత్వాల నుంచి అభ్యర్థులకు ఆదేశాలు అందాయి. పోలింగ్ రోజున క్రియాశీలకంగా వ్యవహరించిన బూత్ స్థాయి నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ ఏజెంట్ల ఎంపికలో బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా బూత్ స్థాయి నేతలే కీలకంగా వ్యవహరించారు. ఓట్లు లెక్కింపు సమయంలో గోల్‌మాల్ జరగకుండా ఇరుపార్టీల ఏజెంట్లను నియమించుకుంటున్నారు. జూన్ 4న పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఏజెంట్ల వివరాలు అందజేయాలని ఎన్నికల అధికారులు సూచిండంతో ఆ మేరకు జాబితా సిద్ధం చేస్తున్నారు. టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవచ్చు. అభ్యర్థితో పాటు నియోజకవర్గాల్లో జరిగే పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించేందుకు ఒక ముఖ్య ఏజెంట్‌ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇవీ నిబంధనలు..

గతంలో జరిగిన ఎన్నికల్లో ఏజెంట్లుగా పనిచేసిన వారినే ప్రధాన రాజకీయ పక్షాలు ఏజెంట్లుగా నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 4వ తేదీ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంటు గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలకి అనుమతిస్తారు. ముందుగా వివరాలను ఫామ్–18లో సమర్పిస్తే ఏజెంట్లకు పాసులు జారీ చేస్తారు. ఎలాంటి కేసులు లేనివారినే ఏజెంట్లుగా అనుమతిస్తారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నేరచరిత్ర లేనివారిని తమ ఏజెంట్లుగా నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రతిభావంతులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్క విద్యార్థి ముందుకు సాగాలని శిష్టకరణ సంఘ నాయకులు పోలు మహంతి ఉమామహేశ్వర రావు, డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), బలివాడ మల్లేశ్వరరావు, బెహరా రామచంద్రరావు, సదాశివుని రామకృష్ణ, పట్నాయకుని మధు, ఆర్‌పీఎన్ శర్మలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని శిష్టకరణ సంఘ భవనంలో ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. జిల్లాలో పది, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విశ్రాంత శాస్త్రవేత్త ఆరికతోట కనకరాజు నగదు, మెడల్స్, జ్ఞాపికలను బాబూరావు సహకారంతో అందించారు. ఇంటర్మీడియట్‌లో 915 నుంచి 986 మధ్య మార్కులు సాధించిన శిష్టకరణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు 13 మందికి, పదో తరగతిలో 550 నుంచి 585 మధ్య మార్కులు సాధించిన ఎనిమిది మందికి పురస్కారాలను అందించారు. సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈబీసీ సాధనకు తామంతా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు పట్నాయక్, గోకుల్ విజయ్, ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్ అండర్ పాసేజ్ వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం పట్టణానికి చెంది సీహెచ్ గౌతమ్‌చంద్ర(24) మృతి చెందాడు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. స్థానిక స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బరంపురం నుంచి చత్రపతి శివాజీ టెర్మినల్‌కు వెళ్లేందుకు రిజర్వేషన్ టికెట్ తీసుకున్న గౌతమ్‌చంద్ర శనివారం రాత్రి 7.20 గంటల సమయంలో పూండి వద్ద జారిపడి చనిపోయి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు బట్టి కుటుంబ సభ్యులకు సచాచారం అందించామన్నారు. శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బొంతలకోడూరు గ్రామానికి చెందిన పంచిరెడ్డి దుర్గాప్రసాద్ (33) పురుగుల మందు తాగి ఈ నెల 16న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యానికి బానిస కావడం, అప్పులపాలు కావడం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.